స్కెచ్

# "దగాపడిన తమ్ముళ్ళు"

ద్రోణంరాజు కృష్ణమోహన్

"హీరాలాల్ గారూ, మీరన్నమాట నిలబెట్టుకోలేక పోతున్నారు" గట్టిగా అన్నాడు శంకరం.

"ఏమిటయ్యా నిలబెట్టేది? చెప్పానుగా, నీకిష్టమైతే ఆ నూటయాభైకే పనిచెయ్యి. లేదా నీ దారి నువ్వు చూచుకో. ప్రతి దీపావళికీ ఒక నెల జీతం ఫూరికే యిస్తూంటిమి. ఇంకా మా చేత కాదు" ఖండితంగా చెప్పేశాడు హీరాలాల్.

"సేఠ్ గారూ, నేను మీ ఆఫీసులో రెండేళ్ళనుంచీ యిదే జీతానికి పనిచేస్తున్నా మేనేజరుగా. చేరినప్పుడే మీరు వాగ్దానం చేశారు ఆరు నెల్లో రెండు వందలు చేస్తానని. ఇంతవరకూ వొక్క దమ్మిడీకూడా ఎక్కువ చెయ్యలేదు."

"అవునయ్యా, ఎలా చేస్తాం. ఇనప వ్యాపారంలో నష్టమొచ్చింది. కలప అడితీలో వాటాదారు దావావేసి తనభాగం తను తీసుకుపోయి, పోటీగా ఎదురుగుండా వ్యాపారం సాగిస్తున్నాడు. నాకెంత నష్టమొస్తోందో మీకేం తెలుసు? ఎరువుల వ్యాపారంలో నూటికి పది రూపాయలుకూడా లాభం రాలేదు."

"మీకొచ్చిన లాభనష్టాలన్నీ నాకు బాగా తెలుసు. మూడు కొట్లల్లోనూవున్న గుమాస్తాల చేత సక్రమంగా పనిచేయిస్తూ, యిన్‌కంటాక్సు వాళ్ళని మీ షాపు పొలిమేరలోకి రాకుండా చేసి, బోలెడంత లాభం చూపిస్తూ, యింకో మేడకూడా మీ చేత కొనిపించానే! ఇదేనా మీరిచ్చే ప్రతిఫలం?"

"మా కో ఫలాలు తులాలు తెలియవయ్యా, పో. మహా పెద్ద లాభం చేశావులే" గద్దించి పలికాడు హీరాలాల్.

"సరే, యిక యింతేనా?"

"అన్నమాటే"

"అయితే, నా రాజీనామా కాగితం యిదిగో. ఈ బొంబాయిలో రెండువందలు సంపాదించని ఆఫీసు మేనేజరు ఎవరున్నారు? గతిలేక ఆ రోజుల్లో నమ్మి మోసపోయాను"

"జాస్తి మాట్లాడకయ్యా, పెద్ద మనిషీ! ఇదిగో తీసుకో చెక్కు. నీకు రావలసిన జీతం బాకీ" అని చెక్కు యిచ్చాడు వంద రూపాయలకి.

అది పుచ్చుకుని బయటకొచ్చేశాడు శంకరం. రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నాడు. మూడో రోజు బయలుదేరాడు నగరంలో వేటకి ఉద్యోగంకోసం. మూడురోజులు విధివిరామం లేకుండా ఆఫీసులన్నీ గాలించాడు, కాని ఫలితం శూన్యం. తనకి టైపు బాగా వొచ్చు. వెళ్ళి చూశాడు: విక్టోరియా టెర్మినస్‌కు ఎదురుగా వొక వందమంది టైపిస్టులు ఖాళీగా కూర్చున్నారు, మషన్లు ముందెట్టుకుని. శంకరానికి నిరాశ కలిగింది ఏమి చెయ్యడానికి పాలుపోలేదు. జేబులో అరవై రూపాయలు మిగిలాయి. వాటితో కొంప జేరచ్చు. కాని జేరితే, పెళ్ళిచేసి, యిక అక్కడే యే తాలూకాఫీసులోనో జేర్పిస్తాడు అన్నగారు. చచ్చినా బొంబాయికి రానివ్వడు. బొంబాయి వదలకూడదని నిశ్చయించుకున్నాడు. సాయంత్రమయ్యేసరికి మళ్ళీ గది జేరుకున్నాడు. గది గుమ్మానికడ్డంగా ఎవరో పడుకుని వున్నారు.

"లేవయ్యా, లే, ఎవరు నువ్వు?"

"మాది బందరు. పనుండి వొచ్చా" నీరసంగా వచ్చింది ధ్వని.

"అయితే, మన గోంగూరే. అన్నమాట" శంకరం నవ్వాడు.

తెలుగుమాటవినేసరికి ఆ వ్యక్తికి ప్రాణాలు లేచొచ్చాయి.

"మీ రెవరు? ఏం చేస్తున్నా రీవూళ్ళో?" ప్రశ్నించాడు ఆ వ్యక్తి.

"లోపలకు రండి. మాట్లాడాం" అని శంకరం అతన్ని లోపలకు తీసుకెళ్ళాడు, లైటు వేశాడు.

"మీ పేరు?"

"సుదర్శనం"

"సరే. ఎందుకొచ్చినట్టు, యీ వూరు?"

"మూడు రోజులయింది వొచ్చి. జేబులో రెండువంద లుంటే పర్సు కొట్టేశారు పెట్టెతో సహా, వున్న మూడుజతల బట్టలూ అమ్మితే పది హేను రూపాలొచ్చాయి. నాలుగు రోజులు గడిపా. ప్రొద్దుటనుంచి కాఫీకూడా తాగ లేదు" దీనంగా అన్నాడు.

"అదంతా సరే. ఒచ్చిన పనేమిటని అడుగుతున్నా"

"పొట్టకూటికి"

"భేష్! ఇద్దరమూ వొకటే. మీరేం చదివారు?"

"స్కూల్ ఫైనల్ ప్యాసయ్యా. టైపు హైయర్ గ్రేడు ప్యాసయా"

"అలా అయితే అక్కడే వొక ఎనభైరూపాయలదాకా దొరుకుతుందే!"

"ఇక్కడ టైపిస్టుకి రెండు వందల దాకా దొరుకుతుందని, వొస్తే యేదైనా యిప్పిస్తానని వొక మిత్రుడు రెండు నెలలకిందట వుత్తరం రాశాడు. ఆ ఆశమీద వొచ్చా హాయిగా బ్రతుకుదామని."

"మరి అతని దగ్గరకు యింకా వెళ్ళలేదా"

"ఎలా వెళ్ళను? అతని ఎడ్రసు ఉన్న కార్డు పర్సులో పెట్టా. పర్సే పోయిందిగా! పేరు మాత్రం తెలుసు"

"ఏమిటి పేరు?"

"నారాయణ"

"ఎక్కడ పని?"

"ఏదో బ్యాంకులో క్యాషియరు. ఎక్కడ వెదికినా కనపడలేదు"

"సరే అతని సంగతి తరువాత చూద్దాం లెండి ముందు నాకు ప్రాణాలు పోతున్నాయి" గొంతుక పూడిపోయింది.

"భోజనానికి వెళ్ళివద్దాం లేవండి" అని తీసికెళ్ళి భోజనం మస్తుగా పెట్టించాడు. ఆరాత్రి సుఖ నిద్ర తీశారు.

తెల్లవారింది. ఇద్దరూ చెరోవైపూ బయలుదేరారు వుద్యోగాన్వేషణార్థం. ఒక చోట సుదర్శనానికి స్పేర్ టైము టైపిస్టుగా, వుదయం ఎనిమిదినుంచి పదివరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరువరకు, పనిచేస్తే నెలకు, యాభై రూపాయలు యిస్తామని, వొకళ్ళన్నారు. కాని దాంతో గడిచేదెలా? ఇద్దరూ నాలుగు రోజులు గాలించారు. డబ్బెవరిదగ్గరా లేదు. అంతా ఖాళీ. రాత్రి ప్రాణం పోయినట్టుగా కూలబడ్డాడు శంకరం మంచంమీద. కాస్సేపటికి సుదర్శనం వొచ్చి "యేం భాయీ సాహెబ్! ఎక్కడైనా దొరికిందా?" నవ్వుతూ ప్రశ్నించాడు. శంకరం ఒకసారి దీక్షణంగా చూసి,—

"నీకేం! నవ్వుగా వుంటుంది. నాకుగూడా ఎవడైనా యింత ధర్మపిండం పడేస్తే బాగుంటుంది" విసుగ్గా అన్నాడు. సుదర్శనం మనస్సు చివుక్కుమంది. తల వొంచుకుని,

"క్షమించు బ్రదర్! ఏం అలా మాట్లాడుతున్నావు?" ఎంతో నెమ్మదిగా అన్నాడు

'ఎవడికైనా కాస్త బుర్ర వుండాలి. ఇన తల నేనెంత చస్తున్నానో నీకేం తెలుసు? ప్రొద్దున లేవగానే నాదగ్గర రెండో మూడో పట్టుకెడతావు. రాత్రి గదికి చేరతావు. ఉద్యోగంలేదు, సద్యోగంలేదు. నీదంతా చూస్తే యేదో నాటకంలాగ వుంది" ఉద్రేకంతో యింకా ఏవేవో అన్నాడు. సుదర్శన్ పాలిపోయిన బుగ్గలమీదనుంచి కన్నీళ్లు కారాయి. దగ్గరకొచ్చి—

"నే వెడుతున్నా శంకరం. నన్ని బొంబాయిలో పదిరోజులు పోషించావు. కృతజ్ఞుణ్ణి. నీ ఋణం తీర్చుకుంటా" అని వెళ్ళిపోయాడు అలాగే ఆ కట్టుబట్టతో మాసిన గడ్డంతో. అతను వెళ్ళిపోగానే శంకరం మనసారా ఒకసారి యేడ్చాడు. తల బాదుకున్నాడు, ఒక సహృదయుణ్ణి బాధ పెట్టినందుకు.

* * *

పది హేను రోజుల తరువాత విక్టోరియా టెర్మినస్ కు ఎదురుగుండా వున్న పార్కులో ఒక శవం కనబడింది ఒకరోజు వుదయం. ఎవ్వ

రికీ తెలియలేదు ఎవరైందీ ఆ శవం. కాని మూడునెలలు అద్దె బాకీ పడడంచేత, సుదర్శనం వెళ్ళిపోయిన మరునాడే ఇంట్లోంచి బలవంతంగా యిద్దరు ఫైల్వానులచేత గెంటించబడి పేవ్‌మెంటులమీద కాపురం చేస్తున్న శంకరానికి మాత్రం తెలుసు ఆ శవం ఎవరో. తల తిరిగిపోయింది. వెంటనే స్టేషనులోకి పరుగెత్తికెళ్ళి వోకమూల కూర్చుని, తనలో తనే గుండె పగిలేటట్టు యేడ్చాడు. "భగవంతుడా నాకలాంటి చావు వొద్దు. నన్ను చంపకు, నన్ను బతకనీ. నాకీమాటు వందరూపాయలేచాలు." అని ప్రార్థించాడు.

హీరాలాల్ దగ్గరకు పరుగెత్తాడు, ఆపిచ్చి బట్టలతో, ఎర్రబడ్డ కళ్ళతో. అవతారం కనిపెట్టి "ఏం ప్రొద్దున్నే పరుగెత్తుకొచ్చావ్? రెండువందల రూపాయిల వుద్యోగస్థులు మా దగ్గర కొస్తారా" ఎత్తిపొడుపు తీవ్రంగా తగిలింది శంకరానికి. అయినా సంబాళించుకుని,

"లేదు సేఠ్‌జీ! నేను మిమ్మల్ని వదిలి యింకోళ్ళ దగ్గర పనిచెయ్యగలనా?" చేతులు జోడించాడు.

"అయితే, యీమాటు నీ జీతమెంతో తెలుసా?" ఠీవిగా ప్రశ్నించాడు.

"ఆఁ తెలుసు. వందరూపాయలు" లేని చిరునవ్వు తెచ్చుకున్నాడు శంకరం. సేఠ్‌జీ సంతోషంతో కాస్త టీ తీసుకొచ్చి యిచ్చాడు శంకరానికి. శంకరం జీతం ఇప్పుడు గుమస్తాల జీతం కన్నా యిరవైయే ఎక్కువ.

"నాకు గూడా ఎవడైనా యింత ధర్మపిండం పడేస్తే బాగుండును!" మళ్ళీమళ్ళీ ఆ మాటలే ప్రతిధ్వనిస్తూ వుంటాయ్ శంకరం చెవుల్లో.

స్కెచ్

# త్రిశంకు నరకం

కాలజ్ఞానం సుబ్బారావు

శూన్యంలోకి తదేక దీక్షతో చూస్తున్నాడు సుబ్బారావు. పార్కులో రేడియోనుంచి మధురమైన గీతాలు—బాలసరస్వతి పాడుతోంటే తనకి వినపడడం లేదు. వినపడినా కర్ణకఠోరంగానే ఉంది. కొందరు పిల్లాజల్లాతో-అప్పుడే పెండ్లయిన కొత్త సంసారులు భార్యాసమేతంగా వచ్చి ఉల్లాసంగా ఉంటే తనకేమో యింతటి విశాల ప్రపంచంలో దిక్కే లేదనిపించింది. విశ్రాంతికని పార్కుకు వెడితే తనకక్కడ ఏ విశ్రాంతి దొరకలేదు సరిగదా మనస్సులో తీరని వ్యథ ఏర్పడింది. బుర్ర సమస్యలమయమై కూర్చుంది. తనూ అక్కడ సంతోషంగా వుండేవాళ్ళ లెక్కల్లో మనిషే కదూ? మరైతే తన అవస్థ? చిరిగిన జుబ్బా జేబులో చెయ్యి పోనిస్తే ఓ బీడీ ముక్క దొరికింది. తనకది రిలీఫ్ నిస్తుంది. పక్కవాని ధర్మమా అంటూ నిప్పుకి వెతుకులాడ నక్కరలేకుండా పోయింది.

పాపం, నరసింహం తను పెండ్లి చేసుకోబోతున్నానని తనకెంత ఉప్పొంగి పోతూ చెప్పాడు! సంసారి అయ్యాకగాని ఆ కష్టాలు ఎవరికీ తెలీవు, ముఖ్యంగా నడిమంత్రపు తరగతి వాళ్ళకి. ప్రభుత్వాలు మారి చట్టాలు మారినా తన జీవితంలో నవ్వే యెరుగడు. చదువుకున్న రోజుల్లో సంపాదన లేకున్నా వారాలమీద నిశ్చితంగా బ్రతికాడు. వాళ్ల అమ్మ నీళ్లు మోసేది. బడి జీతానికి వారూ వీరూ ధర్మస్వరూపులు (యింకా కలికాల మహాత్మ్యం సోకనివాళ్లు) చందాలిస్తే సాఫీగా నడిచింది విద్యా జీవితం. మెట్రిక్‌తో తను విధిగా నిలవాల్సొచ్చింది. ఏదో తనకంతవరకు సాయం చేసినవుణ్యాత్ముల ధర్మమా అంటూ ఓగుమాస్తాగిరి చిక్కింది. గంతకుతగిన బొంతని పెండ్లి చేసారు. ఓ బిడ్డకూడా కలిగింది. అయిదేండ్లు తనకు తెలీకుండానే కాలం దొర్లుకపోయింది. భార్య రెండో కాన్పులో కాలం చెయ్యడం-తల్లి లేని